క్లుప్తంగా

దుబ్బాక అభివృద్ధే ధ్యేయం



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని అందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డులో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయానికి ఎమ్మెల్యే తన సొంత నిధులతో బోరు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మ దయతో దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్, నాయకులు తొగుట రవీందర్, మచ్చ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: మున్సిపాలిటీని మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిల సహకారంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట 10వ వార్డులో గల పద్మశాలి వీధిలో రూ.10లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ పైఅంతస్తు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజశ్రీకాంత్, నాయకులు ఆస రవి, శ్రీకాంత్, రాంప్రసాద్, మలేషియా శ్రీను, శ్రీశైలం, లక్ష్మీనర్సవ్వ, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఫైజన్ అహ్మద్‌కు సోమవారం సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు వైద్యులు ఒకరిద్దరు మాత్రమే డ్యూటీ చేయడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి చికిత్సలు చేయించుకుంటున్నారని తెలిపారు. ఆస్పత్రిని అకస్మికంగా తనిఖీ చేసి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా బీరప్ప కల్యాణం



ఉత్సవాల్లో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మండలంలోని గుంటిపల్లి బీరప్ప ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఆయనను ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ హన్మంత్ ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి కమాన్ నుంచి ఆలయం వరకు గల రోడ్డు విస్తరణ పనులను జెడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, విద్యుత్ అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ జరుగుతున్న సమయంలో అవసరమైన చోట నుంచి విద్యుత్ స్తంభాలను మార్చాలని, విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండి సహకరించాలని ఏఈ కనకయ్యకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ శివకుమార్, టెంపుల్ ఏఈ అంజయ్య, కిషన్ పాల్గొన్నారు.

సమతావాదం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

సిద్దిపేటజోన్: మతతత్వ బీజేపీ, కులతత్వ బీఎస్పీలతో తెలంగాణకు ఒరిగేది ఏమి లేదని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమసమాజ రాజ్యం, సమతావాదం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఫొటో పెట్టుకొని ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ అధికారంలోకి వచ్చి అంబేడ్కర్ ఆశయాలను విస్మరించిందన్నారు. తెలంగాణకు భరోసా కేసీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిపాల్‌గౌడ్, శ్యామ్, నరేశ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



దుబ్బాక: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు

దుబ్బాక: రైతులకు మద్దతు ధర అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని దౌల్తాబాద్ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందూప్రియల్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ శ్యామలకుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమ్మమల్లేశం, ఉపసర్పంచ్ కడారి మల్లేశం, సీసీ కనకరాజు తదితరులున్నారు.

మద్దూరు(హుస్నాబాద్): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని సర్పంచ్ ముక్క కనకయ్య అన్నారు. సోమవారం దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వరూప, సీసీ మహేందర్, ఆర్‌ఐ ఐలయ్య, వీవోఏ వినోద, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాకపోతే తొలగిస్తారా?

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని, నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిన సీఎం కేసీఆర్ ఉద్యోగాన్ని ఇంకో 6 నెలల్లో నిరుద్యోగులే పీకేస్తారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులర్ చేయమని ఆందోళన చేస్తుంటే సంబంధిత మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు టెంట్లు పీకేసి రేపటిలోగా విధుల్లో చేరాలని లేకుంటే తొలగిస్తామని సర్క్యులర్ జారీ చేయడం దుర్మార్గమన్నారు. వారిని తొలగించడం కాదు ఎర్రబెల్లి మీ ప్రభుత్వాన్నే సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో 1.91 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని బిశ్వాల్ కమిటీ సూచించిన విధంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడడం తప్పా ఒక్క ఉద్యోగాన్ని భర్తీ చేయకపోవడం ఈ ప్రభుత్వ అసమర్థ పాలనకు అద్దం పడుతోందన్నారు.

11న సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్

నిరుద్యోగులకు అండగా ఉండాలనే లక్ష్యంతోనే బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఈ నెల 11న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు జరిగే నిరుద్యోగ మార్చ్‌కు ఉమ్మడి జిల్లాలోని ప్రతి బూత్ నుంచి నిరుద్యోగులు వచ్చేలా చూడాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని 250 బూతుల నుంచి బూత్‌కు 20 మంది నిరుద్యోగులకు తగ్గకుండా 5 వేల మంది హాజరయ్యేలా కార్యచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, మచ్చ శ్రీనివాస్, సంతోష్, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా వేణుగోపాలుడి ఊరేగింపు



హనుమత్ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాలుని కోవెలలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌లకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బాలభోగం, సుదర్శన మూలమంత్ర హవనం జరిపించారు. ఆదివారం రాత్రి స్వామివారి హనుమత్ వాహనసేవ నేత్రపర్వం చేసింది. స్వామివారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవలో ఉత్సవ నిర్వాహకులు, పుర ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొని తరించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న పరమేశ్వర్

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ హెల్పర్ బుచ్చక్క మహేందర్ ఇటీవల మరణించగా కుటుంబాన్ని చిన్ననాటి స్నేహితుడు ముత్యాల పరమేశ్వర్ సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకొని రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిత్రుడి అకాల మరణం తనను కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల చదువులకు అండగా ఉంటానని చెప్పారు.

ముమ్మరంగా పునరావాస కాలనీ పనులు



బంగారులొద్దితండా సమీపంలో కొనసాగుతున్న పనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితుల కోసం పునరావాస కాలనీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులు మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారులొద్దితండా సమీపంలో సుమారుగా 26ఎకరాల్లో నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రస్తుతం అక్కడా ప్రభుత్వ భూమిని చదును చేస్తూ రోడ్లు వేస్తున్నారు. కాగా ఐదు తండాల భూ నిర్వాసితులు రోజు అక్కడికి చేరుకొని పనులను వీక్షిస్తున్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందించాలని డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు చందు మహారాజ్ కోరారు. రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా అందించాలని కోరుతూ సోమవారం మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్లకు వినతి పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం గ్రంథం పట్ల 90 శాతం ప్రజలకు అవగాహన లేక పోవడంతోనే పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం విఫలం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడిపోయి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉంటేనే దేశ ప్రగతి ముందుకు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దమాతరి లక్ష్మణ్ మహారాజ్, రవి, శ్రీకాంత్, దీపక్, నవీన్, మహేశ్, మనోజ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అన్నారు. సోమవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుండె నొప్పి వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేస్తే 50 శాతం బతికే అవకాశం ఉందన్నారు. సీపీఆర్ చేసే విధానం గూర్చి నిపుణులు వివరించారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, వైద్యులు వినోద్‌కుమార్‌తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, వివిధ రకాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

గజ్వేల్‌రూరల్: చేతికి అందిన పంటలు అకాల వర్షాల కారణంగా నేలపాలవడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని బీజేపీ ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారని పేర్కొన్నారు. మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఐకేపీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యంను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ మహేశ్, బీజేపీ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏగొండ, నాయకులు శ్రీనివాస్, నరేందర్, విజయ్, హన్మంతు, బాలయ్య, ఆనంద్‌సాయిగౌడ్, నర్సింలు, సూర్యారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సెలవులో అక్కన్నపేట ఎంపీడీఓ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి ఈ నెల 06వ తేదీ నుంచి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. కానీ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఇంకా ఎవరూ బాధ్యతలు తీసుకోలేదు. ఎంపీఓ కవికుమార్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకోవాలని చెప్పిన అతను తీసుకోలేదు. దీంతో ఎంపీడీఓగా ఎవరొస్తారు అనే చర్చ జోరందుకుంది. పరిస్థితి ఇలాగే ఉంటే మండల పరిషత్ పరిపాలన గాడితప్పుతుందనే విమర్శలు లేకపోలేదు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

◆ దుండగులను అరెస్ట్ చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): అంబేడ్కర్ విగ్రహాన్ని అపహరించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, బహుజన రాజకీయ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి భూంపల్లి మధులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ధర్మారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని మాయం చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళితులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం సోమవారం నాటికి మూడోరోజుకు చేరుకుంది. శాంతియుతంగా ఆందోళన చేసిన 28 మంది దళితులపై బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్, నాయకులు యాదగిరి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, లింగుపల్లి సర్పంచ్ జోగ్యారి బాల్‌నర్సింహులు హితవు పలికారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు ఉనికి కోసమే లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధే ధ్యేయంగా దుబ్బాక నియోజకవర్గంలో అహర్నిశలు కృషి చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు.

◆ క్రీడలతో మానసిక ఉల్లాసం

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని సర్పంచ్ పన్యాల లింగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గంగాపూర్‌లో ఖోఖో కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం, ఐకమత్యం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామస్వామి, నాయకులు దరిపల్లి సాయిలు, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, పన్యాల వెంకట్‌రెడ్డి, భూమాగౌడ్, తిరుపతి, షాదుల్లా క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

◆ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోహెడరూరల్(హుస్నాబాద్): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు పేర్యాల దేవేందర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని వేంకటేశ్వరపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, సర్పంచ్‌లు తోట భాగ్యలక్ష్మి, నవ్య, రమేశ్, బోలుమల్ల చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి మంజ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

దుబ్బాక: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ భౌగోళిక రాష్ట్రంలో సామాజిక న్యాయం అందని ద్రాక్షలాగా మారుతుందని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీన సిద్దిపేటలో జరిగే తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భావ సదస్సు కరపత్రాలను సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, రాజయ్య, మహేశ్, భిక్షపతి, బాలయ్య, భాస్కర్, తదితరులున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటివరకు రూ.30కోట్లు విలువ గల సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇటీవల హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి మంత్రి కేటీఆర్ మరో రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో పట్టణంలోని ప్రతి వీధిలో సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు, సెంటర్ లైటింగ్ సిస్టం, కూడళ్ల అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎండీ సాధిక్ తదితరులు ఉన్నారు.

యువ సంఘర్షణ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు జిల్లా కేంద్రం నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న యువ సంఘర్షణ సభకు ప్రియాంక గాంధీ రానున్నట్లు, ఆమె రాకతో బీఆర్‌ఎస్‌కు వణుకు పుట్టిందని, అందుకే కేటీఆర్ అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని, గాంధీల కుటుంబాలకు తెలంగాణ ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. ప్రియాంక గాంధీ హైదరాబాద్ పర్యటనపై కేటీఆర్ అధికారంలో ఉన్నామనే అహంకారంతో వ్యాఖ్యలు చేస్తున్నారని, వాస్తవాలను గమనించాలన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శిస్తే తగిన గుణపాఠం తప్పదని కేటీఆర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ముద్దం లక్ష్మి, గాజుద్దీన్, ఫయాజ్, నరసవ్వ, రజిత, పుల్లూరు కనకయ్య, భిక్షపతి, దాసాంజయ చంద్రశేఖర్, యాదగిరి, ప్రవంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



బతుకమ్మ ఆడుతున్న మహిళా జేపీఎస్‌లు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం నోటిఫికేషన్‌లో తెలిపిన విధంగా 4 సంవత్సరాల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేయాలని జేపీఎస్ జేఏసీ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె సోమవారానికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వంపై శాంతియుతంగా సమ్మె చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సమ్మెలో పాల్గొని మద్దతు తెలుపుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సేవలను గుర్తు చేసుకొని వెంటనే రెగ్యులర్ జీఓను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో లెనినగర్ సర్పంచ్ సబితాభాస్కర్, ఐనాపూర్ సర్పంచ్ రమణారెడ్డి, తాడూరు, రాంసాగర్, ములుగు మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను గద్దెదింపుదాం

హుస్నాబాద్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తూ దేశాన్ని తిరోగమన పద్ధతిలో తీసుకెళ్తున్నాయని సిద్దిపేట ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు కనుకుంట్ల శంకర్, జేరిపోతుల జనార్ధన్, హన్మకొండ జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శి భాష బోయిన సంతోష్‌లు విమర్శించారు. సోమవారం పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో నియోజకవర్గస్థాయి ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో నిరుద్యోగాన్ని పెంచుతూ ఉపాధి కల్పించడంలో విఫలం చెందాయని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వాలను గద్దెదించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో ఈ నెల 15న నిర్వహించే బహిరంగ సభకు విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు రాజ్‌కుమార్, నరేశ్, ప్రశాంత్, కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి



రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన సచివాలయంలో ఐఏఎస్ అధికారి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావును సోమవారం కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతూ అన్నదాతల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులకు ఉపయోగపడేలా గజ్వేల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇటీవల ప్రారంభించిన ఈ భూసార పరీక్ష కేంద్రంలో అవసరమైన సిబ్బందితో పాటు లాబరేటరీ పరికరాలను సమకూర్చి రైతులకు అందుబాటులోకి వచ్చేవిధంగా ఆదేశాలివ్వాలని విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

కాలజ్ఞానం తెలియజేయడం అభినందనీయం



నవీన్‌ను సన్మానిస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని గ్రామ గ్రామాన తిరుగుతూ భక్తులకు తెలియజేస్తున్న విశ్వ బ్రాహ్మణ ప్రచారకులు రొంజకల్లెపల్లె నవీన్ సేవలు అభినందనీయమని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లె పహాడ్)లో బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని భక్తులకు తెలియజేసేందుకు వచ్చిన నవీన్‌ను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. వంశపారపర్యంగా బ్రహ్మంగారి జీవిత చరిత్రను మూలస్తంభం నుంచి మొదలుకొని పూర్తయ్యే వరకు కాలజ్ఞాన గడియలను తెలియజేస్తూ హిందూ సనాతన ధర్మాన్ని నలుదిశలా వ్యాప్తి చేయడం హర్షణీయమని, ప్రతి ఒక్కరూ కాలజ్ఞానాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే కొనుగోళ్లు జరిగేలా కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో రైతులు నష్టపోయి బాధల్లో ఉన్నారని, వారిని ఇబ్బంది పెట్టకుండా వెంట వెంటనే కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కేంద్రనిర్వాహకులు ఉన్నారు.